క్లుప్తంగా

పోల్ టు పోల్ సర్వే



పోల్ దగ్గర సర్వే చేస్తున్న ఏఈ మహిపాల్

దౌల్తాబాద్: మండలంలో విద్యుత్ శాఖ సిబ్బంది ఆయా గ్రామాల్లోని విద్యుత్ స్తంభాలను సర్వే చేస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలో ఎన్ని పోల్స్ ఉన్నాయి. వాటి పరిస్థితి ఏమిటి? స్తంభాలకు ఏమైనా సామాగ్రి అవసరమా? ఏమైనా విద్యుత్ తీగలు ఉన్నాయా? లేవా? పోల్ నుంచి పోల్‌కు ఎంత దూరం ఉంటుంది? వంటి వివరాలు సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఈ సర్వేను అన్ని గ్రామాల లైన్‌మెన్లు, ఆర్టిజన్‌లు, సిబ్బంది చేపడుతున్నారు. అన్ని గ్రామాల్లో 15 రోజుల నుంచి సర్వే నిర్వహిస్తున్నారు. రెండు మూడు రోజుల్లో సర్వే పూర్తవుతుందని ఏఈ మహిపాల్ తెలిపారు.

దాడిని ఖండిస్తూ విధుల బహిష్కరణ



విధులు బహిష్కరించిన న్యాయవాదులు

కొడంగల్: కోస్గిలో న్యాయవాది మడుగు భీమేశ్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ గురువారం కొడంగల్ బార్ అసోసియేషన్ న్యాయవాదులు విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమపై దాడులు చేసే వారిని కఠినంగా శిక్షించాలన్నారు. న్యాయవాదులకు రక్షణ చట్టాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు వెంకట్‌రెడ్డి, వెంకటయ్య, బస్వరాజ్, కరుణాకర్‌రెడ్డి, ఆనంద్, మురళీనామాజీ, భాగ్యలత, రాములు, కృష్ణయ్య, సంతోశ్‌కుమార్, రమేశ్, భానుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన చౌరస్తాలో కూరగాయలు విక్రయించొద్దు


ఇన్‌చార్జి ఎంపీడీఓ భాస్కర్



కూరగాయల విక్రేతలకు సూచనలు ఇస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ భాస్కర్

కుల్కచర్ల: ప్రధాన రహదారి మధ్యలో కూరగాయలు విక్రయించొద్దని కుల్కచర్ల ఇన్‌చార్జి ఎంపీడీఓ భాస్కర్ పేర్కొన్నారు. గురువారం కుల్కచర్ల మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో కొంతమంది కూరగాయలు విక్రయిస్తున్న నేపథ్యంలో వారికి తగిన సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణ నిమిత్తం పోలీసుల సూచనలను అనుసరించి ప్రధాన చౌరస్తాలోని రోడ్డుపై ఎలాంటి వ్యాపార సముదాయాలు నిర్వహించొద్దన్నారు. ఆయా వ్యాపార నిర్వహణ చేయాలన్న కేటాయించిన గదుల లోపలి భాగంలో లేదా ప్రత్యేక ప్రదేశంలో మాత్రమే విక్రయించుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ పాఠశాలకు విద్యార్థిని ఎంపిక



కుల్కచర్ల: ఐదో తరగతి నుంచి స్పోర్ట్స్ పాఠశాల ప్రవేశానికి మరికల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థిని ఆద్య ఎంపికైంది. నెల రోజులుగా వివిధ స్థాయిల్లో నిర్వహించిన ఎంపిక ప్రక్రియలో భాగంగా చౌడాపూర్ మండలం మరికల్ ప్రాథమిక పాఠశాలకు చెందిన ఆద్య అత్యంత ప్రతిభను ప్రదర్శించింది. అందులో భాగంగా గురువారం విడుదల చేసిన ఫలితాల్లో మరికల్ ప్రాథమిక పాఠశాల నుంచి ఆద్య ఎంపికైనట్లు ప్రకటించారు. స్పోర్ట్స్ పాఠశాలకు ఎంపిక అవ్వడంతో ఉపాధ్యాయ బృందం, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

హాస్టళ్లలో భోజనం తనిఖీ



విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న అధికారులు

దోమ: సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని డిప్యూటీ తహసీల్దార్ నర్సింహులు, ఎంఈఓ వెంకట్ సూచించారు. కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆదేశం మేరకు దోమలోని కేజీబీవీ, ఎస్సీ హాస్టల్‌ను గురువారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న వంటకాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

వర్షాలు కురవక.. నీటి వసతి లేక!



ఆలేడ్ సమీపంలో వరి నారు

- ఆందోళనకరంగా వరి సాగు
- రెండు నెలలు గడిచినా కరుణించని వరుణుడు
- పొలం చదునుకు నీరు సరిపోక మడుల్లోనే నారు
- వానలకోసం నిరీక్షణ
- ఇబ్బందుల్లో అన్నదాతలు

దుద్యాల్: ఖరీఫ్ ప్రారంభమై దాదాపు రెండు నెలలు గడుస్తున్నా నేటికి వర్షాలు కురవకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వేసిన పంటలు వేసినట్లే రోజురోజుకు వాడుముఖం పడుతున్నాయి. వానలు సకాలంలో పడకపోవడంతో వివిధ రకాల పంటలు సాగు చేయడానికి వెనకడుగు వేస్తున్నారు. వరి సాగు కోసం తయారు చేసుకున్న నార్లు కొందరివి నారు మడుల్లోనే ఉన్నాయి. మరికొందరు నార్లు పోసుకుని వర్షం కోసం పడిగాపులు కాస్తున్నారు. రుతుపవనాలు ముందస్తుగా ప్రారంభమైనప్పటికీ వరుణుడు కరుణించకపోవడంతో అన్నదాతలకు ఇబ్బందులు తప్పడం లేదు.

భూగర్భ జలాల్లో నీటి మట్టం..

వరి సాగుకు నీరు సంవృద్ధిగా అవసరం ఉంటుంది. ఎండల తీవ్రతకు బోర్లలో నీరు అడుగంటిపోయాయి. ప్రస్తుతం వానలు పడితే భూగర్భ జలాలు పెరుగుతాయని భావించిన రైతన్నకు నిరాశే మిగిలింది. ఒక్క భారీ వర్షం కూడా నమోదుకాలేదు. భూ గర్భ జలాల్లో నీటి మట్టం పెరగలేదు. దీంతో వరి నాటు వేయడానికి సరిపడ నీరు అందక సమస్యలు తీవ్రం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు నాట్లకోసం పొలాలను సిద్ధం చేయలేకపోతున్నామని దిగాలు చెందుతున్నారు. చల్లుకున్న నార్లు పెరిగి నాటు దశకు చేరుకున్నా పొలం చదును చేసేందుకు నీరు అందకపోవడంతో సమస్యలు ఎదుర్కొంటున్నారు.

10 వేల ఎకరాల నుంచి 15వేల వరకు..

మండలంలోని దుద్యాల్, హస్నాబాద్, లగచర్ల, చిలుముల మైల్వార్, చెట్టుపల్లి తండా, ఈర్లపల్లి, హకీంపేట్, పోలేపల్లి, కుదురుమల్ల తదితర గ్రామాల్లోని రైతులు అధికంగా వరి పంటలను పండిస్తున్నారు. గతేడాది మండలంలో 10 వేల ఎకరాల నుంచి 15 వేల ఎకరాల వరకు వరి సాగుచేశారని వ్యవసాయ అధికారులు తెలిపారు. సకాలంలో వానలు కురవకపోతే వరి సాగు గతేడాది కంటే మరింత తగ్గే అవకాశం ఉందని చెబుతున్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి



గతేడాది కూడా వర్షాలు ఆలస్యంగా కురవడంతో చివర్లో సాగు విస్తీర్ణం పెరిగింది. ఈ సంవత్సరం కూడా రెండు నెలలు కావస్తున్నా భారీ వర్షాలు కురవక పోవడంతో రైతులు కొంత ఆందోళనలో ఉన్నారు. బోరుబావుల్లో నీటివసతి ఉన్నవారు ఇప్పటికే నాట్లు వేసుకున్నారు. నీరు తక్కువగా ఉన్న వారు మాత్రం ఇంక వేయలేదు. వానల కోసం ఎదురుచూస్తున్నారు. నారు మడుల్లో నారు ఉంటే ఎలాంటి ఇబ్బంది ఉండదు. కానీ తగిన జాగ్రత్తలు తీసుకుంటే సరిపోతుంది. ఇంకా కొంత సమయం ఉంది. వర్షాలు కురుస్తాయనే నమ్మకం ఉంది. రైతులు ఆధైర్య పడొద్దు.

– నాగరాజు, వ్యవసాయ అధికారి, దుద్యాల్

పరిగి నుంచి దుద్యాల్‌కు బస్సు సౌకర్యం

హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, ప్రజలు



బస్సును ప్రారంభిస్తున్న నాయకులు, గ్రామస్తులు

దుద్యాల్: పరిగి నుంచి దుద్యాల్ మండల కేంద్రానికి ఆర్టీసీ అధికారులు ఏర్పాటు చేసిన బస్సును గురువారం కొడంగల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకారం వేణుగోపాల్, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేరుగు వెంకటయ్యలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..దుద్యాల్ మండలం ఏర్పడి దాదాపుగా మూడేండ్లు కావస్తున్న బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రయాణికులు, విద్యార్థులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించేవారు. బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని పలుమార్లు అధికారులను కోరామన్నారు. దీనికి స్పందించి అధికారులు బస్సు సౌకర్యం కల్పించడం అభినందనీయమన్నారు. మండల కేంద్రానికి బస్సు రావడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు శ్రీనివాస్ రెడ్డి, శ్రీశైలం గౌడ్, కృష్ణ, యుగంధర్ రెడ్డి, చాంద్‌పాషా, సత్యనారాయణ, శ్రీకాంత్, అనంతయ్య, ఖాజా గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

బస్సు నడిచే వేళలు

ఉదయం 7:45 గంటలకు పరిగి నుంచి బయలుదేరి తుంకిమెట్ల, లగచర్ల మీదుగా 8:30 గంటలకు దుద్యాల్ మండల కేంద్రానికి చేరుకుంటుంది. అక్కడి నుంచి హకీంపేట్ మీదుగా కోస్గికి, అక్కడి నుంచి తిరిగి నేరుగా పరిగికి వెళ్తుంది. సాయంత్రం 5:00 గంటలకు కోస్గి నుంచి బయలుదేరి హకీంపేట్ మీదుగా దుద్యాల్‌కు అక్కడి నుంచి లగచర్ల, తుంకిమెట్ల మీదుగా పరిగికి చేరుకుంటుంది. ఈ బస్సు సర్వీసును విద్యార్థులు, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

సంబురంగా సర్కారు బడి బోనం



కుల్కచర్ల: బోనాలతో అమ్మవారి ఆలయానికి వెళ్తున్న విద్యార్థులు



నవాబుపేట: బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

పోతరాజుల వేషధారణలో ఆకట్టుకున్న విద్యార్థులు

కుల్కచర్ల: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు సంప్రదాయ పద్ధతిలో గురువారం బోనాలు నిర్వహించారు. బోనాలతో అమ్మవారి ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పోతరాజుల వేషధారణలో చిన్నారులు ప్రదర్శించిన విన్యాసాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ మాట్లాడుతూ..విద్యార్థులకు సంస్కృతి, సంప్రదాయాలను నేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేశ్, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

దాతాపూర్‌లో..

నవాబుపేట: మండల పరిధిలోని దాతాపూర్ గ్రామంలో బోనాలను ఘనంగా జరుపుకున్నారు. గ్రామంలోని మహిళలు బోనాలతో శివారులోని పోషమ్మ దేవాలయం వరకు ఊరేగింపుగా వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం పోతరాజుల విన్యాసాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బల్వంత్‌రెడ్డి, గ్రామ పెద్దలు జంగయ్య, బాల్‌రెడ్డి, బోజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భారతి అల్ట్రాఫాస్ట్‌కు తిరుగులేదు



ప్రమాద బీమా బాండ్లు అందజేస్తున్న సామ్రాట్

టెక్నికల్ ఇంజనీర్ సామ్రాట్

అనంతగిరి: సిమెంట్ రంగంలో భారతి అల్ట్రాఫాస్‌కు తిరుగులేదని టెక్నికల్ ఇంజనీర్ సామ్రాట్ పేర్కొన్నారు. వికారాబాద్‌లో గురువారం సాయి గణేష్ ట్రేడర్స్ డీలర్ షాప్‌లో తాపీ మేస్త్రీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్లతో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ చాలా వేగవంతంగా పూర్తవుతుందన్నారు. ముఖ్యంగా స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రహదారులకు సరైన ఎంపికని చెప్పారు. అల్ట్రాఫాస్ట్ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందజేస్తామన్నారు. స్లాబ్ వేసే సమయంలో నిపుణులైన భారతి సిమెంట్ ఇంజనీర్లు సైట్ వద్దకే వచ్చి సహాయపడతారని తెలిపారు. మార్కెట్లో లభించే ఇతర సిమెంట్లతో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్ రూ.20 అధికంగా ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం తాపీ మేస్త్రీలకు రూ. లక్ష ప్రమాద బీమా బాండ్లను 25 మందికి అందచేశారు. ఈ కార్యక్రమంలో భారతి సిమెంట్ బృందం, తదితరులు పాల్గొన్నారు.

పీఎం యూఎస్పీ సద్వినియోగం చేసుకోవాలి

కొడంగల్ రూరల్: ప్రధానమంత్రి ఉచ్చతర్ శిక్షా ప్రోత్సాహన్ (పీఎం యూఎస్పీ) యోజనను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా మంజూరు చేసే స్కాలర్‌షిప్ తీసుకోవాలంటే ఇంటర్మీడియట్ లేదా తత్సమాన పరీక్షలో రెగ్యులర్‌గా ఉత్తీర్ణులై, 80శాతం మార్కులు కలిగి ఉండాలని తెలిపారు. ఏ ఇతర స్కాలర్ షిప్ తీసుకోని విద్యార్థులు మాత్రమే దీనికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కుటుంబ వార్షిక ఆదాయం నాలుగున్నర లక్షల లోపు ఉండాలని తెలిపారు. ఈ స్కాలర్ షిప్‌కు ఎంపికైన డిగ్రీ మొదటి, రెండవ, మూడోవ సంవత్సరంలో ప్రతీ ఏటా రూ. 12వేల చొప్పున, పోస్టు గ్రాడ్యుయేట్‌లో సంవత్సరానికి రూ. 20వేలు మంజూరు చేస్తుందని తెలిపారు. దీనికి ఎంపికైన విద్యార్థులు ప్రతీ ఏడాది 50శాతం కంటే అధికంగా మార్కులు సాధించాల్సి ఉంటుందని ఆయన వివరించారు. పూర్తి వివరాలకు కళాశాల అకడమిక్ కో ఆర్డినేటర్ టి.రాంబాబు 8523025938 ఫోన్‌నంబర్‌లో సంప్రదించాలని పిన్సిపాల్ డాక్టర్ బి శ్రీనివాస్‌రెడి కోరారు.

బస్సులు పునరుద్ధరించాలని వినతి



డిపో మేనేజర్ మూర్తికి వినతిపత్రం అందజేస్తున్న నాగిరెడ్డిగూడ గ్రామస్తులు

మొయినాబాద్: ఆర్టీసీ బస్సులు రద్దు చేయడంతో రైతులు, విద్యార్థులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని.. తిరిగి సర్వీసులను పునరుద్ధరించాలని నాగిరెడ్డిగూడ గ్రామస్తులు మెహిదీపట్నం డిపో మేనేజర్ మూర్తికి విన్నవించారు. ఈ మేరకు గురువారం మండల పరిధిలోని నాగిరెడ్డిగూడ గ్రామస్తులు మెహిదీపట్నం బస్‌డిపోకు వెళ్లి మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. మెహిదీపట్నం నుంచి నాగిరెడ్డిగూడ మీదుగా బాకారం వరకు 288ఎన్/బీ నంబరు బస్సులు గతంలో రోజుకు 9 ట్రిప్పులు ఉండేవని.. ఇటీవల 7 ట్రిప్పులు రద్దు చేసి కేవలం ఉదయం, సాయంత్రం రెండు ట్రిప్పులు మాత్రమే నడుపుతున్నారని మేనేజర్‌కు తెలిపారు. బస్సులు లేకపోవడంతో విద్యార్థులు, రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. బస్సులు లేక ఐదు కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఆర్టీసీ బస్సులను పునరుద్ధరించి ఉదయం 3 ట్రిప్పులు, మధ్యాహ్నం 2 ట్రిప్పులు, సాయంత్రం 4 ట్రిప్పులు నడపాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు అర్జున్, మాజీ సర్పంచ్ సద్గుణాచారి, నాయకులు భిక్షపతియాదవ్, మాణిక్యం, నందకుమార్, సుధాకర్, శివకుమార్ తదితరులు ఉన్నారు.

చెరువుల పరిరక్షణకు చర్యలు



కొత్తూరు: చెరువు కట్ట మరమ్మతులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొత్తూరు: చెరువులు, కుంటల పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఇందులో భాగంగా గురువారం పట్టణంలోని కాశన్నకుంట చెరువు కట్ట మరమ్మతు పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భూగర్భ జలాల పెంపుతో పాటు సాగు, తాగునీటి అవసరాలకు చెరువులు, కుంటలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చెరువులు, కుంటల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. ఇప్పటికే ప్రభుత్వం చెరువుల మరమ్మతుల కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు స్పష్టం చేశారు. వాటి పరిరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని కోరారు. చెరువు ఎఫ్‌టీఎల్‌లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టొద్దన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య, కమిషనర్ బాలాజీ, నాయకులు సుదర్శన్‌గౌడ్, దేవేందర్‌యాదవ్, కట్రొళ్ల సురేందర్, నర్సింహ, విజయపాల్‌రెడ్డి, నవీన్‌చారి, పాశంకృష్ణ, శివశంకర్‌గౌడ్, జగన్ పాల్గొన్నారు.

అమ్మవారి దీవెనలు అందరిపై ఉండాలి

షాద్‌నగర్‌రూరల్: అమ్మవారి చల్లని దీవెనలు ప్రజలందరిపై ఉండాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం మున్సిపల్ పరిధిలోని 22వ వార్డులోని భగత్‌సింగ్‌కాలనీలో కట్టమైసమ్మ బోనాల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దాతల సహకారంతో కట్టమైసమ్మ దేవాలయం నిర్మాణాన్ని పూర్తి చేయడం అభినందనీయమన్నారు. ప్రజలందరూ ఐకమత్యంతో ప్రశాంతంగా పండుగలను జరుపుకోవాలని కోరారు. మన సంస్కృతి సంప్రదాయాలు ప్రపంచ దేశాలకే ఆదర్శమన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన అన్నదాన సత్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యేను పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సరితయాదగిరియాదవ్, ఆలయ కమిటీ అధ్యక్షుడు నలమోని శ్రీధర్, భిక్షపతి, నడికూడ యాదగిరియాదవ్, జంగరాజు, రమేశ్, సురేష్, శ్రీశైలంగౌడ్, బీరయ్య, తులసీరాం నాయక్, నర్సింలుయాదవ్, మహ్మద్‌అలీ, నరేశ్, తుపాకుల శేఖర్, అందె మోహన్, ముబారక్ అలీఖాన్, కుమ్మరి శ్రీనివాస్, బాల్‌రాజ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితునికి ఆర్థిక సాయం



శమీమ్ భర్త వైద్యానికి ఆర్థిక సాయం చేస్తున్న మిత్రులు

ధారూరు: కిడ్నీ పాడైన భర్త వైద్యానికి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న శమీమ్‌కు స్నేహితులు ఆర్థిక సాయం చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి..యాలాల మండలం పగిడ్యాల గ్రామ ఉన్నత పాఠశాలలో 2004–05లో శమీమ్ పదోతరగతి వరకు చదివింది. తర్వాత ధారూరు మండలం దోర్నాల్ గ్రామానికి చెందిన ముక్తార్‌ను వివాహం చేసుకుంది. ఇటీవల ముక్తార్ కిడ్నీ ఫెయిల్ అవడంతో చికిత్స నిమిత్తం ఆర్థిక భారం ఎదుర్కొంటుంది. ఈ విషయం తెలుసుకున్న ఆమె స్నేహితులు అండగా నిలిచి ఒక్కొక్కరు రూ.500ల చొప్పున మొత్తం రూ.27వేలు సేకరించి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె వారికి కృతజ్ఞత తెలిపింది.

నాటిన ప్రతీ మొక్కను పరిరక్షించాలి

- ప్రిన్సిపాల్ బ్యూలా
- మోడల్ స్కూల్లో వన మహోత్సవం



మోడల్ స్కూల్ ఆవరణలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

బంట్వారం: నాటిన ప్రతీ మొక్కను పరిరక్షించాలని ప్రిన్సిపాల్ బ్యూలా పేర్కొన్నారు. గురువారం బంట్వారం మోడల్ స్కూల్లో వన మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో విద్యార్థులు మొక్కలు నాటారు. అనంతరం ప్రిన్సిపాల్ బ్యూలా మాట్లాడుతూ నాటిన ప్రతీ మొక్కను నీరు పోసి పరిరక్షించాలన్నారు. మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు టై, బెల్టుల అందజేత



టై, బెల్టులు అందజేస్తున్న ఉపాధ్యాయులు తదితరులు

యాలాల: మండలంలోని చెన్నారం ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయిని దాత వద్ద శాంతి విద్యార్థులకు టై, బెల్టులు అందజేశారు. గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాంప్లెక్స్ జీహెచ్‌ఎం సుధాకర్ విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు తన వంతు బాధ్యతగా భావించి ఉపాధ్యాయిని శాంతి సాయం చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కరణం లక్ష్మీకాంత రావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

త్యాగాలకు ప్రతీక పీర్ల పండుగ



మోమిన్‌పేట: ఎన్కేపల్లిలో పీర్ల ఊరేగింపు



దుద్యాల్: నిమజ్జనానికి తరలిస్తున్న కొడి పీర్లు

మోమిన్‌పేట: మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో గురువారం త్యాగాలకు ప్రతీకగా నిలిచిన పీర్ల పండుగను కుల మతాలకు అతీతంగా జరుపుకొన్నారు. మహిళలు, యువకులు, వృద్ధులు తేడా లేకుండా ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ పండుగలో షర్బత్ ప్రత్యేకంగా నిలిచింది. దీన్ని రెండో పీర్ల పండుగగా పేర్కొంటారు. ఈ ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కొడి పీర్లు

దుద్యాల్: మండల పరిధిలోని హస్నాబాద్ గ్రామంలో కొడి పీర్ల పండుగను గురువారం ఘనంగా జరుపుకున్నారు. మొహర్రం ముగిసిన తర్వాత నిర్వహించుకోవడం ఆనవాయితీ. గ్రామంలో ముస్లిం కాలనీలో 9 రోజుల పాటు పీర్లను ఏర్పాటు చేసుకుని భక్తిశ్రద్ధలతో నిర్వహించి మొక్కులు చెల్లించుకుంటారు. పీర్లకు ప్రత్యేకంగా ఊదు, బెల్లం చదివింపులు చేస్తారు. మహిళలు బొడ్డెమ్మలతో, పురుషులు అలై ఆటలు ఆడి చూపరులను ఆకట్టుకున్నారు. అనంతరం పీర్లను నిమజ్జనానికి తరలించారు.

వేతనాలు చెల్లించాలని వినతి



తాండూరు రూరల్: ఎంపీడీఓ సుశీల్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఉపాధి హామీ సిబ్బంది

తాండూరు రూరల్: మూడు నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం తాండూరు మండలం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ సుశీల్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు మూడు నెలలుగా వేతనాలు విడుదల కాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ఈ విషయంలో తక్షణమే ప్రభుత్వం స్పందించి వెంటనే వేతనాలు విడుదల చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్లు వినతి పత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ నరోత్తంరెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్‌అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు విడుదల కాలేదని..

ధారూరు: ధారూరు మండల కేంద్రంలో గురువారం నిర్వహించాల్సిన ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్ల వీక్లీ సమావేశాన్ని ఎఫ్‌ఏలు, టీఏలు బహిష్కరించారు. ఈ మేరకు వారు ఎంపీడీఓ షఫీఉల్లాకు వినతిపత్రం సమర్పించారు. వరుసగా మూడు నెలల వేతనం రాలేదని, దీంతో తమకు కుటుంబ పోషణ భారంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. తమ పిల్లల నెలవారి ఫీజులు కూడా కట్టలేని పరిస్థితిలో ఉన్నామని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. తక్షణమే తమ వేతనాలు విడుదల చేయాలని వినతిపత్రంలో కోరారు.

రోడ్డు విస్తరణలో జాప్యమెందుకు?

- బడా వ్యాపారి షాపింగ్ కాంప్లెక్స్ వద్ద నిలిచిన పనులు
- చర్చనీయాంశంగా కాల్వ నిర్మాణ పనులు



హెచ్‌బీ కాంప్లెక్స్ వద్ద నిలిచి పోయిన కాల్వ నిర్మాణ పనులు

తాండూరు: తాండూరు పట్టణంలో రోడ్ల విస్తరణ ఒక అడుగు ముందుకు.. రెండడుగులు వెనక్కి అన్న చందంగా మారింది. చించోళి–మహబూబ్‌నగర్ జాతీయ రహదారిపై పట్టణంలోని హెచ్‌బీ పర్తానీ కుటుంబానికి చెందిన షాపింగ్ కాంప్లెక్స్‌ను 15 ఏళ్ల క్రితం నిర్మించారు. నిబంధనలకు విరుద్ధంగా అప్పట్లో సెల్లార్‌తో షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేశారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో మొదలైన రోడ్డు విస్తరణ పనులు ఇతర ప్రాంతాల వరకు విస్తరించారు. కాని ఇందిరాచౌక్ నుంచి కాంగ్రెస్ కార్యాలయం వరకు నిర్వహించే పనుల్లో అక్రమ నిర్మాణాలను కూల్చలేదు. హెచ్‌బీ కాంప్లెక్స్, అమృతప్ప కాంప్లెక్స్‌లు రోడ్డుపైనే ఉన్నా కూల్చే సాహసం చేయట్లేదు. ఇందిరాచౌక్ నుంచి బస్ స్టేషన్ వరకు రోడ్డును విస్తరించాలని, వరద నీటి కాల్వలను పూర్తి చేయాలని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి వారం రోజుల క్రితం మున్సిపల్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో హెచ్‌బీ కాంప్లెక్స్ వద్ద మాత్రం మూడురోజులుగా పనులు నిలిపేశారు. సామాన్యులపై జులూం ప్రదర్శించే అధికారులు బడా వ్యాపారులకు చెందిన షాపింగ్ కాంప్లెక్స్ కూల్చకుండా మధ్యలోనే వదిలేయడం స్థానికంగా చర్చనీయంగా మారింది.